కథ

# డిఎన్ఎ టెస్ట్




ప్రతాప
వెంకట సుబ్బారాయుడు
సెల్: 9393981918




"నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?" కోపంగా అన్నాడు జగదీశ్.

తెలుసన్నట్టుగా మెల్లగా తలూపాడు రాఘవ.

"మీ నాన్నకీ, నీకు డిఎన్ఎ టెస్ట్ చేయించుకోవడమేమిట్రా?"

"అవున్రా మా నాన్నకి నాకు రక్త సంబంధం లేదని నాకు అనిపిస్తోంది."

"గడ్డాలు మీసాలు వచ్చాక ఇప్పుడు ఈ డౌట్ రావడమేమిట్రా? చిన్నప్పట్నించి నిన్ను పెంచడంలో ఏవన్నా వివక్ష చూపించాడా?"

"లేదురా.. కానీ మనసులో ఏ మూలో ఒక అనుమానం. మా అమ్మకీ నాన్నకీ ఇద్దరికీ కూడా రెండో పెళ్ళే. నన్ను చిన్నప్పట్నించి బాగానే చూసుకున్నారు. నాకే లోటూ రానీయలేదు. అసలు మొన్న మా ఊళ్ళో జరిగిన పెళ్ళికి నేను వెళ్ళకపోయినా .. ఆ పెళ్ళికి జయమ్మమ్మ రాకపోయినా ఈ విషయం తెలిసేది కాదు. అక్కడ పెళ్ళిలో ఆవిడ, అమ్మా నేను మాట్లాడుకుంఉటుంటే మా దగ్గరగా వచ్చి 'అవునే వీడు నీ పిల్లాడేనా.. అప్పుడే ఎంత పెద్దవాడైపోయాడే! మీ పెళ్ళయినప్పుడు చూశాను.. మళ్ళీ ఇప్పుడు ఇన్నాళ్ళకి కలిశాం. మీ ఆయన ఏమీ అభ్యంతర పెట్టకుండా తన సొంత కొడుకులా చూసుకుంటున్నాడన్నమాట" అంది. మా అమ్మ నవ్వుతూ చూసింది. నేను ఏమీ ఎరగనట్టు అటెటో చూస్తుండి పోయాను గాని.. నిజానికి అప్పట్నించి నా మనసులో అది నాటుకుపోయింది. న్నాంటే 'పరాయి' అన్న ఫీలింగ్ కలుగుతోంది. అందుకే డిఎన్ఎ టెస్ట్‌కి వెళదామనిపిస్తోంది".

"అసలు విషయం మీ అమ్మా నాన్నల్ని అడగకపోయావా?"

"అడగలేనురా! ఇలాంటి విషయం ఎలా మాట్లాడడం?."

"పోనీ ఆ విషయం మర్చిపోయి నువ్వు ఎప్పటిలా వుండొచ్చు కదరా?"

"లేదురా! వుండలేకపోతున్నాను. నాకు మా నాన్న ఎవరో? ఎలా వుండేవారో తెలుసుకోవాలని తెగ ఆత్రుతగా వుంది."

"అంత క్లియర్‌గా వున్న తర్వాత ఇంక ఈ టెస్ట్‌లూ అవీ ఎందుకు?"

" లేదురా ఆధారాలు లేకుండా మాట్లాడకూడదు."

"మరెలా చేయిస్తావు?"

"మా నాన్న పెద్దవాడైపోయాడు. అప్పుడప్పుడు డాక్టర్ల దగ్గరకీ ల్యాబ్ టెస్ట్‌లకీ తప్ప గుమ్మం కదలడం లేదు. రేపు అన్ని టెస్ట్‌లు చేయించాలని చెప్పి ల్యాబ్‌కి తీసుకెళుతున్నాను. అక్కడే ఈ టెస్ట్ చేయించడానికి కూడా శాంపిల్ తీసుకుంటారు. ఇదంతా ముందే మాట్లాడేశాను."

"ఒకవేళ రిజల్ట్ నువ్వనుకున్నట్టుగా నెగెటివ్‌గా వస్తే.. మీ నాన్నని ఇహ నువ్వు చూడవా?"

"చూస్తాను.. 'నన్ను పెంచి పెద్ద చేసిన ఒక పెద్దమనిషి' అన్న భావనతో కృతజ్ఞతగా చూస్తాను. సాటి మనిషిగా చూస్తాను. కాని తండ్రిలా మాత్రం కాదు." స్పష్టంగా సూటిగా చెప్పాడు.

* * *

ఎప్పుడూ అయితే సరోజమ్మ గారు తీసుకెళుతుంది. రాఘవ ఆఫీసుకి వెళతాడు. అలాంటిది దగ్గరుండి తండ్రిని ల్యాబ్‌కి తీసుకెళ్లి పరీక్షలకి శాంపిల్స్ ఇప్పించాడు.

అంతా పూర్తయి బయల్దేరబోతుంటే రాఘవకి ఆఫీసు నుంచి

ఫోన్ వచ్చింది. తండ్రిని ఒక దగ్గర కూర్చోబెట్టి బయటకెళ్ళాడు ఫోన్ మాట్లాడడానికి. ఆ పక్కనుండి వెళుతున్న పరంధామయ్య గారు జగన్నాథం గార్ని గుర్తు పట్టి మాట్లాడడానికి పక్కన కూర్చున్నాడు. వాళ్ళిద్దరు చిన్నప్పటి మిత్రులు. ఒకరంటే ఒకరికి అభిమానం." "ఒరేయ్ పరంధామం.. నాకీ మధ్య అస్సలు బాగుండడం లేదురా. సుగర్ లెవెల్స్ మాత్రం నువ్వు కనుక్కుని సెల్ ఫోన్లో చెబితే డాక్టరు మా ఇంటిదగ్గరే వుంటారు.. వెళ్ళి మంచి మందు రాయించుకుంటాను. మిగిలిన రిపోర్ట్ ్స కాస్త ఆలస్యమయినా ఫర్వాలేదు. రిపోర్టులు తేవడానికి బాబుకు కాస్త సమయం చిక్కాలి కదా!" అన్నాడు.

"దానికేం భాగ్యం ఈ ల్యాబ్ ఇంఛార్జి నాకు తెలిసినవాడే! విషయం ఇహ నాకొదిలేయ్" అని వెళ్ళిపోయాడు. ఆయనలా వెళ్ళాడో లేదో రాఘవ తండ్రి దగ్గరకొచ్చి 'పదండి వెళ్దాం' అన్నాడు. ఎప్పుడూ 'నాన్నా' అని మధురంగా పిలిచే కొడుకు అలా 'పదండి' అని పొడిపొడిగా అనేసరికి ఆయనకి ఆశ్చర్యం, బాధ కలిగాయి.

* * *

ఆరోజు ల్యాబ్ రిపోర్ట్ ్స వస్తాయి.

రాఘవ మనసు ఆందోళనతో నిండి వుంది.

'డిఎన్ఎ టెస్ట్‌లో ఏం తెలుస్తుంది? తనెలా రియాక్ట్ కావాలి' మనసంతా గజిబిజిగా ఆలోచనలు. ఆ రోజు ఆఫీసుకి ఆలస్యంగా వస్తానని తెలియజేశాడు.

అన్నీ జగన్నాథం గారు  గమనిస్తూనే వున్నారు.

ల్యాబ్‌కి వెళ్ళి రిపోర్ట్ ్స వణికే చేతులతో తీసుకుని అన్ని రిపోర్ట్‌ల పేపర్లు తప్పిస్తూ అసలైన పేపరు దగ్గర ఆగాడు. అతని గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంటోంది. చదివి ఆనందంతో ఎగిరి గంతేశాడు. విషయం జగదీష్‌కి సెల్‌లో చెప్పి గబగబ తన తండ్రికిష్టమైనవన్నీ కొని ఇంటికి బయల్దేరాడు.

ఆనందంగా ఇంట్లోకెళ్ళి 'నాన్నా' అని అన్నీ ఆయన చేతిలో పెట్టి ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టి ఆఫీసుకి బయల్దేరబోయాడు.

అప్పుడే సరోజమ్మ అటొచ్చి "ఏరా నాన్న మీద అంత ప్రేమ పుట్టుకొచ్చింది." అంది పుత్ర వాత్సల్యంతో.

"నేను వాడి తండ్రినని ఇప్పుడే తెలిసింది" అన్నాడాయన

"ఇప్పుడు తెలియడమేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది.

తండ్రికి ఆ విషయం ఎలా తెలిసిందా? అని షాకయ్యాడు రాఘవ.

"అదా పరంధామయ్య చెప్పాడు. నా కొడుకు నాకు తెలియకుండా నా బ్లడ్ శాంపిల్ తీసుకుని పితృత్వ పరీక్ష జరిపించాడు. నా అదృష్టం బాగుంది కాబట్టి తండ్రినని వచ్చింది. కాదని వచ్చుంటే నన్ను ఈపాటికి రోడ్డు మీదకి తోసేసేవాడు." అన్నాడు బాధగా.

"ఏంట్రా నాన్నగారు అంటున్నది నిజమేనా? నీకిదేం బుద్ధిరా?" కోపంగా అంది సరోజమ్మ.

"అమ్మా!.. నాకూ చాలా బాధగానే వుంది. కానీ నా తండ్రెవరో తెలుసుకోవాలనే తపన నన్నా పని చేయించింది."

"నోర్ముయ్‌రా కొన్ని తెలిసీ తెలియక చేసే పనులు అందరి మనసులు గాయపరుస్తాయి. నీకేమన్నా అనుమానాలుంటే నన్ను గాని ఆయన్ను గాని అడగవచ్చు కదా?

తెలుసుకోవలనుకోవడం తప్పు కాదు.. ఇలా తెలుసుకోవాలనుకోవడం తప్పు. సైన్స్ అభివృద్ధి చెంది ఒక పక్క మానవాళి మనుగడ సుగమమవుతుటే మరోపక్క విలువలు సమిధలవుతున్నాయి. ఆయన నీకే లోటు చేశారు.. చెప్పు? అర్థమైంది. ఆరోజు పెళ్ళిలో జయమ్మమ్మ మాటలకి నువ్వు రియాక్ట్ అయి వుంటావు. అనుమానం మనిషి జీవితాన్ని అధ:పాతాళానికి నెట్టేస్తుంది. రేపు నీ పెళ్ళయ్యాక ఎవరో నీ భార్య గురించి రెండు మాటలు నెగటివ్‌గా చెబితే ఇలాంటి పిచ్చి పనులేగా చేస్తావు? మనిషి మనుగడకి నమ్మకమే పునాది. నమ్మకమున్న చోట మనశ్శాంతి వుంటుంది. అయినా నీకు అనుమానమొచ్చింది కాబట్టి ఒక నిజం చెబుతాను. మీ నాన్నతో నా పెళ్ళికి ముందే నాకు ఒక బాబున్నాడు. మీ నాన్న మనతో పాటే వాడూను అని హృదయ వైశాల్యాన్ని చాటుకున్నా నేనే ఇలాగే మన బంధువులు కలిసినప్పుడు కాని ఇతరత్రా కాని ఇలాంటి విషయాలు చర్చకు వస్తే అందరి మనసులు గాయపడతాయని వాణ్ణి హాస్టల్ ఉంచి చదివించాము. వాడు ఇప్పుడు ఉద్యోగం చేసుకుంటూ ఒంటరిగా ఉంటున్నాడు. నిజానికి తల్లిదండ్రుల పెంపకం లేక నిర్లక్ష్యానికి గురైంది వాడు. కాని మేము వాడికి మెచ్యూర్టి వచ్చాక అన్ని విషయాలు కూలంకషంగా చెప్పి బాధపడ్డాము. వాడు జరిగినదానికి ఏ మాత్రం బాధ పడకుండా తన్నంతవాడిని చేసినందుకు మమ్మల్ని అభినందించాడు.. గౌరవించాడు. వాడొకడున్నట్లు కూడా నీకు తెలియదు. కాని మా రక్తం పంచుకుని పుట్టి మా ప్రేమాభిమానాలు పుష్కలంగా అందుకున్న నువ్వు మాత్రం ఆయన్ని అనుమానించావు. ఏది ఎదురవుతుందని నా కొడుకుని దూరంగా వుంచి పెంచామో అదే నీ నుండి ఎదురైంది. ఈ జన్మకిది చాలురా.. "అని కన్నీళ్ళతో లోపలికెళ్ళిపోయిందావిడ.

రాఘవ బాధగా తండ్రి కాళ్ళకి చుట్టుకుపోయాడు.

* * *

**(విజ్ఞానం అనూహ్యంగా విస్తృతమవుతోంది. అభివృద్ధి దిశగా ఎంతగా అడుగులేస్తున్నామో వినాశనం వైపు కూడా అన్నే అడుగులు పడుతున్నాయి. ముందు ముందు డి.ఎన్.ఎ లాంటి పరీక్షలు సర్వసాధారణ మయితే జీవితాలు ఎలా విచ్ఛిన్నమవుతాయి? అన్న ఊహే ఈ కథకి ప్రేరణ.)**